# శతాధిక సంవత్సర పర్లాఖిమిడి బాప్టిష్టు సంఘము

పర్లాఖిమిడి బాప్టిష్టు సంఘ చరిత్ర తెలుసుకోవాలంటే ముందుగా ఆకులతంపర తల్లి సంఘము గురించి తెలుసుకోవాలి.

కవి పురుషోత్తమ చౌధరి అన్నగారు జగన్నాధ చౌధరి క్రైస్తవుడు కాలేదు. ఈయన ఆకులతంపర మొఖాసాదారుల కోరికపై ఆ గ్రామ మిరాసీదారుగా (కరణీకము) చేరి అక్కడ స్థిరపడ్డారు. ఈయన సంతానము ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో ఇద్దరు కుమారులు - అప్పల నరసింహ, గోపీనాధు - చిన్నాయన పురుషోత్తమ చౌధరి అడుగు జాడలను అనుసరించి క్రైస్తవులయ్యారు. అప్పల నరసింహ తన తండ్రి బ్రతికుండగానే 1864 సం॥లో రెవ. జె. డబ్ల్యూ. గోర్డన్ దొరగారి వలన జలప్రోక్షణము పొంది, చిట్టివలస లండన్ మిషన్ సంఘ సభ్యుడయ్యారు. గోపీనాధు తన తండ్రి చనిపోయాక 1873 సం॥లో క్రైస్తవుడయ్యారు.

పురుషోత్తమ చౌధరి సువార్త ప్రకటించిన గ్రామాలలో అకులతంపర యొకటి.

అప్పల నరసింహ చౌధరి, భార్య శాంతి కుమారి, సేవకురాలు జంగం గంగమ్మ 1871 సం॥లో కటకపురి వెళ్ళి, అచ్చట మహానదిలో రెవ. దాస్ అంతర్వేది గారిచే బాప్తిసం పొందారు. 1873 సం॥లో గోపీనాధు చౌధరి, భగవాన్ బెహరా (వైద్యుడు) కటకపురి వద్ద, మహానదిలో రెవ. దాస్ అంతర్వేది గారిచే బాప్తిసం పొందారు. ఈ విధంగా ఐదుగురు బాప్టిష్టు క్రైస్తవులు కలసి ఆకులతంపర బాప్టిష్టు సంఘంగా 1873 అక్టోబరు / నవంబరులో ఏర్పడిరి. అప్పల నరసింహ గారు కాపరిగా యుండిరి. అప్పుడు రెవ. పురుషోత్తమ చౌధరి (బరంపురంలో పాష్టరుగా యుండిరి), రెవ. దాస్ అంతర్వేది గార్ల (విజయనగరంలో 41వ రెజిమెంట్ - మెస్ మేనేజర్ మరియు చాప్లిన్‌గా యుండిరి) ప్రోత్సాహ సహాయములతో ఆకులతంపర సంఘము ముందుకు సాగింది.

ఏడుగురు కెనేడియన్ బాప్టిష్టు మార్‌టైమ్ మిషనెరీలలో నొకరగు రెవ. డబ్ల్యూ.ఎఫ్. ఆర్మ్ స్ట్రాంగ్ గారు 1876 సం॥లో పర్లాఖిమిడికి మిషనెరీగా వచ్చారు. ఈయనకు ఆకులతంపర సంఘము ఆయాచిత వరముగా దక్కింది. సంఘ సభ్యులతో మంచి సంబంధ మేర్పడి, చుట్టు ప్రక్కల నున్న గ్రామాలలో సువార్త ప్రకటించుటకు మంచి ఆవకాశ మేర్పడింది. మిస్ ఫ్లోరా క్లార్క్ KIH తన గ్రంధము "Sisters : Canada and India" నాల్గవ అధ్యాయములో ఇలా వ్రాశారు.

".....Akula Thampara, a village, 10 miles from Parlakimidi. Before the 41st Regiment sailed for Burma in 1877, Mr. Antharvedi visited Akulathampara and formally placed the Church under the care of the maritime Province Canadian Baptist mission. The Church is thus the oldest in said mission and is designated as "Mother Church" ..... ".

1876 సం॥ ఆగష్టు నెల నుండి అప్పల నరసింహ చౌధరి, భగవాన్ బెహరా గార్లను కెనడియన్ మిషన్ వారు బోధకులుగా నియమించారు. ఇదే సమయములో పురుషోత్తమ చౌధరి, దాస్ అంతర్వేది గార్లు ఆకులతంపర వచ్చారు. గోపీనాధు చౌధరి గారి భార్య రత్నమయి, భగవాన్ బెహరా గారి భార్య రత్నమణి, వారి కుమార్తె ముక్తామణి వంశధార నదిలో రెవ. దాస్ అంతర్వేది గారిచే బాప్తిసం పొంది ఆకులతంపర సంఘ సభ్యులయ్యారు. సభ్యత్వం ఎనిమిదికి పెరిగింది.

క్రమముగా, నూతన విశ్వాసులు చేరికతో సంఘము దినదినాభివృద్ధి చెందింది. కొందరు క్షత్రియులు కూడా క్రైస్తవులయ్యారు.

కాలక్రమములో, బ్రతుకు తెరువు నిమిత్తము, సంఘ సభ్యులు పర్లాఖిమిడి, టెక్కలి, శ్రీకాకుళం, బరంపురము, విశాఖపట్నం, చెన్నపట్నం మొదలగు ప్రదేశాలకు తరలిపోయారు. తర్వాత, తర్వాత, వారి సంతతి, దేశ విదేశాలకు విస్తరించారు. సంఘ సభ్యుల ఇంటి పేర్లేవన - చౌధరి, కాళిమహంతి, రాజు, బండి, దేవు, పులి, పెద్దిని, పంగ, మొయ్య, కాకర్ల, బెహరా మున్నగునవి.

1980 సం॥ వంశధార వరదలో ఆలయము కొట్టుకపోయి మొండి గోడలు మిగిలాయి. తర్వాత అవి కూడా పూర్తిగా శిథిలమై దిబ్బ ఏర్పడింది. ఆ స్థలము త్వరలోనే సాగునీటి ప్రాజెక్టులో మునిగి పోబోతుంది.

కీ॥శే॥ పాష్టరు పురుషోత్తమ చౌధరి తన వేదన పద్య రూపములో వ్యక్త పరిచారు.

సీ॥ వంశధారానది ఉప్పొంగి - ప్రవహించె
గ్రామాల నన్నింటిని - కూలద్రోసె
తరతరాలనాటి తాతలు - కట్టిన
గృహములు నీటిలో - కూలిపడియె
ఆరంభ సంఘమగు - ఆకులతంపర
సభ్యులు లేనట్టి - సంఘమయ్యె
కష్టాలకెదురీది కట్టిన - ఆలయము
కదలదయ్యెను, నది - కదపలేదె !

తే॥గీ॥ ఆది సంఘంబునకది - ఆనవాలో
తిరగి సంఘంబచ్చట - చేరనగునో
యేది కారణంబో - ఎరుగలేము
దైవ చిత్తంబేమిటో - తలపగలమా !

<u>**పర్లాఖిమిడి సంఘము :**</u> కవి పురుషోత్తమ చౌధరి సువార్త ప్రకటించిన ప్రదేశాల్లో పర్లాఖిమిడి ఒకటి. ఆ రోజుల్లో ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యా సాహిత్య కళలకు కేంద్రముగా వుండేది. తెలుగు ఒరియా ప్రజలు కలసి మెలసి యుండేవారు. రాజుగారి పట్టణం. 1876 సం॥లోనే కెనెడియన్ మిషనెరీ వారు పర్లాఖిమిడి విచ్చేశారు. పట్టణం చుట్టు ప్రక్కల నున్న గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతములు మట్టుకు అవిద్య, అనాగరికత, మూఢనామ్మకాలకు నిలయాలు. కనీస వసతులు లేని పరిస్థితి. ఈ ప్రాంతాలలో మిషనెరీ వారు, వారు నియమించిన బోధకులు సువార్త ప్రకటించారు. విద్య, వైద్య సదుపాయాలు కల్పించారు. దీని ఫలితముగా 1892 సం॥ నాటికి పర్లాఖిమిడిలో 14 గురు సభ్యులతో బాప్టిష్టు సంఘ మేర్పడ్డాది. ఇందులో ఎక్కువ మంది బ్రతుకు తెరువు కొరకు ఆకులతంపర సంఘము నుండి వచ్చినవారే. కాబట్టి, తల్లి సంఘమైన ఆకులతంపర సంఘానికి, పర్లాఖిమిడి సంఘం మొట్ట మొదటి శాఖా సంఘము. ఇది స్వపోషక సంఘం.

సుమారు 16 సం॥లు, సంఘారాధన, ఫ్రీమన్ దొర గారి బంగళా కాంపౌండులో ఒక చిన్న బడిలో జరిగేది. పురుషోత్తమ చౌధరి, వేరే భక్తుల చరిత్ర మన కందించిన బాబూ జాన్ చౌధరి (గోపీనాధు చౌధరి రెండవ కుమారుడు) పర్లాఖిమిడి సంఘమునకు ఒక ఆలయముండాలని సంకల్పించి, రెవ. ఐ.సి. ఆర్చిబాల్డు దొరగారి సహాయ సహకారములతో కానుకలు సేకరించి, 1903 సం॥ నుండి ఐదు సం॥లు వ్యయ ప్రయాసలకు ఓర్చి మందిర నిర్మాణము చేపట్టారు. 1908 సం॥ ఆగష్టు 16వ తేదీన ఆలయ ప్రతిష్ఠ జరిగింది. ఇదియే **అంతర్వేది - పురుషోత్తం స్మారక మందిరము.** ఆలయ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. కెనెడియన్ మిషనెరీలు, క్రైస్తవ నాయకులు, పట్టణ ప్రముఖులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠ జరిగాక, రెవ. ఆల్ఫ్రెడ్ జేమ్స్ అప్పన్న గారు సంఘ కాపరిగా నియమింప బడ్డారు. ఈయన అప్పల నరసింహ చౌధరి గారి దౌహిత్రుడు. కాళిమహంతి ధీనబంధు గారి జ్యేష్ఠ కుమారుడు. సుమారు 30 సం॥ సంఘ కాపరిగా వున్నారు. ఈయన 1940 సం॥లో చనిపోగా, ఈయన రెండవ అల్లుడు కీ॥శే॥ పాష్టరు పురుషోత్తమ చౌధరి 1941 సం॥ నుండి 1980 సం॥ వరకూ సంఘ కాపరిగా వున్నారు.

పాష్టరు పురుషోత్తమ చౌధరి, కవి పురుషోత్తమ చౌధరి అన్నగారు జగన్నాధ చౌధరి ముని మనమడు. మామా, అల్లుల్లిద్దరూ సంఘ కాపర్లుగా సుమారు 70 సం॥లు పనిచేశారు (పాష్టరు పురుషోత్తమ చౌధరి గారి స్వీయ చరిత్ర "వెలుగు నీడలు" చదివితే పర్లాఖిమిడి సంఘమునకు సంబంధించి అనేక విషయాలు తెలుసుకోగలరు. ప్రతులకు జె.జె. చౌధరి సెల్ నెం. 9440647374 కు సంప్రదించగలరు).

పర్లాఖిమిడి సంఘములో ప్రత్యక్ష సంబంధమున్న కెనేడియన్ మిషనెరీలు - Rev. I.C. Archibold, Rev. S.C. Freeman, Rev. Glendaning, Miss Harrison, Miss E. Clutton, Rev. G.D. Barss, Miss E.B. Lock Heart, Rev. K. Knight, Rev. D.J. Faster, Miss Bent, Miss Paskal, Miss M. Manuel మున్నగువారు.

1990 సం॥ సరికి మందిరము శిధిలావస్థకి చేరుకొనగా పాష్టరు పురుషోత్తమ చౌధరి జ్యేష్ఠ కుమారుడు డా॥ ఎస్.ఎస్. చౌధరి, దౌహిత్రులు డా॥ రవి మోహన్, డా॥ ప్రదీప్ కుమారులు పూనుకొని పాత మందిరమును కూలగొట్టి క్రొత్త మందిరము నిర్మించారు. క్రొత్త ఆలయం ప్రతిష్ఠ, కవి సార్వభౌముడు పురుషోత్తమ చౌధరి ద్వితీయ శత జయంతి తే. 05-09-2003 దీన ఘనంగా జరిపారు. పాత ఆలయ ప్రతిష్ఠ ప్రాతిపదికగా 2008 సం॥ ఆగష్టు 16వ తేదీన శత సంవత్సరోత్సవము జరిపారు. ఇప్పుడది సెంటినరీ బాప్టిష్టు చర్చి.

- జేమ్సు జయశీల్ చౌధురి